చిత్తూరు, తిరుపతి, మదనపల్లెలో వేడుకలా 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు


ముగ్గు వేస్తున్న బి.విజయలక్ష్మి

ప్రథమ బహుమతి


విజయలక్ష్మికి మొదటి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్

ముందే వచ్చిన ముగ్గుల సంక్రాంతి

నింగిలో విరిసే హరివిల్లు నేలకు దిగింది. రంగురంగుల ముగ్గులతో చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం కళకళలాడింది. ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఏటా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు కేంద్రాల్లో వేడుకగా జరిగాయి. ఈ పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో తిరుపతి, చిత్తూరు, మదనపల్లె కేంద్రాల్లోనూ, ప్రస్తుత తిరుపతి జిల్లాలోని గూడూరులోనూ జరిగాయి. పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంక్రాంతి కళను ముందే మైదానంలో ఆవిష్కరించారు. పిల్లలు, పెద్దవాళ్లు, విద్యార్థినులు పోటీలు పడి ముగ్గులు వేశారు.

చిత్తూరు సెంట్రల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఉల్లాసంగా జరిగాయి. ఈ పోటీలను గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో నిర్వహించారు. లోకల్ స్పాన్సర్‌గా జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్, జీజేఎం సుఖీభవ ఏసీ మహల్ (చిత్తూరు) సహకారం అందించారు. విజేతలకు ముఖ్య అతిథులుగా హాజరైన చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్‌లు బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. సాంకేతిక యుగంలోనూ ముగ్గులు వేయడంపై మక్కువ చూపడం మన తెలుగు సంప్రదాయానికి జీవం పోసినట్లే అన్నారు. భవిష్యత్ తరాలకు ముగ్గుల సంప్రదాయాన్ని తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి మహిళపై ఉందని చెప్పారు. ఆంధ్రజ్యోతి నిర్వహించిన ముగ్గుల పోటీలకు తమ వంతు సహకారం అందించడమే కాకుండా చిత్తూరు రూరల్, గుడిపాల, బంగారుపాళ్యంలో నిర్వహించడానికి తాము సిద్ధమన్నారు. న్యాయనిర్ణేతలుగా సావిత్రమ్మ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు డాక్టర్ జి.ఉషారాణి, లయన్స్ గోల్డ్ డైరెక్టర్ డాక్టర్ మానస, ఐరాల జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం కోమల వ్యవహరించారు. రాష్ట్రస్థాయి స్పాన్సర్లు అయిన.. యవ్వనపు చర్మ సౌందర్యం సంతూర్, సెల్సియా, క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్ లోగోలను చిత్తూరుకు చెందిన సోనియా వేసినవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ మజీద్, జీజేఎం సుఖీభవ ఏసీ మహల్ ఇన్‌చార్జి కిరణ్, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ మేనేజర్ ఆర్‌ఎస్ నాయుడు, రాష్ట్ర గ్రానైట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

ముగ్గు వేస్తున్న డి.బుజ్జీరావు


ద్వితీయ బహుమతి


రెండో బహుమతి అందుకుంటున్న బుజ్జీరావు

ముగ్గు వేస్తున్న జి.ప్రతిభ


తృతీయ బహుమతి


మూడో బహుమతి అందుకుంటున్న ప్రతిభ


చిత్తూరులో జరిగిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

విజేతలిలా.. : ప్రథమ బహుమతిని బి.విజయలక్ష్మి (గుర్రప్పనాయుడు వీధి-చిత్తూరు), ద్వితీయ బహుమతిని డి.బుజ్జీరావు (లక్ష్మీనగర్ కాలనీ-చిత్తూరు), తృతీయ బహుమతిని జి.ప్రతిభ (మురకంబట్టు అగ్రహారం-చిత్తూరు) అందుకున్నారు. కన్సొలేషన్ బహుమతులను టి.తేజశ్రీ, డి.పొన్నియమ్మ, ఎస్.పవిత్ర, ఎస్పీ కళావతి అందుకున్నారు.


మొదటి బహుమతి పొందిన ముగ్గు వద్ద చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీ మోహన్ తదితరులు

ఉమ్మడి జిల్లా విజేత

● మదనపల్లె మహిళ రెడ్డిరాణి


ముగ్గు వేస్తున్న రెడ్డిరాణి

మదనపల్లె, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా విజేతగా మదనపల్లెకు చెందిన ఉత్తరాది రెడ్డిరాణి ఎంపికయ్యారు. మదనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా ఆదివారం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో 76 మంది పాల్గొన్నారు. ఈ పోటీలకు స్థానిక స్పాన్సరర్లుగా జ్ఞానాంభిక డిగ్రీ కళాశాలలు, ఆర్.కె.జ్యువెలర్స్, ఎస్.ఎ.నస్రీన్‌తాజ్ వ్యవహరించారు. మదనపల్లెకు చెందిన వి.రెడ్డిరాణి, ఎ.పద్మ, వి.రెడ్డిరాజేశ్వరి వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, స్పాన్సరర్లు జ్ఞానాభింక డిగ్రీ కళాశాల అధినేత డాక్టర్ రాటకొండ గురుప్రసాద్, ఆర్.కె.జువెలర్స్ అధినేత పచ్చిపాల తులసి, ఎస్.ఎ.నస్రీన్‌తాజ్ విజేతలకు బహుమతులు అందజేశారు. చిత్తూరు, తిరుపతి, మదనపల్లెల్లో మొదటి బహుమతి సాధించిన ముగ్గురిలో మదనపల్లెకు చెందిన వి.రెడ్డిరాణిని జిల్లాస్థాయి విజేతగా న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు.

కుప్పంపై వరాల జల్లు

● మహిళా సాధికారతే ధ్యేయంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్న సీఎం

కుప్పం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): చెప్పారు.. చేసి చూపించడానికి వస్తున్నారు. అయిదేళ్ల వైసీపీ విధ్వంసకర పాలనలో తన కుప్పం ఇరవయ్యేళ్ల వెనక్కి వెళ్లిపోయిందని వగచిన చంద్రబాబు, తిరిగి గాడిన పెట్టడానికి ఈ అయిదేళ్లలో పదేళ్ల అభివృద్ధిని చేసి చూపడానికి సిద్ధపడ్డారు. ముఖ్యమంత్రిగా పదవి అలంకరించాక గత ఏడాది జూన్‌లో వచ్చి నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు చెప్పి వెళ్లాక, ఇప్పుడే రాబోవడం. అయితేనేం.. ప్రతిపక్ష నేతగా, తర్వాత ప్రభుత్వాధినేతగా వచ్చిన సమయంలో కుప్పం ప్రజలకు ఇచ్చిన అభివృద్ధి హామీలను నెరవేర్చడానికి ఇప్పుడు వస్తున్నారు. వరాల జల్లు కురిపించనున్నారు. మహిళా సాధికారతే ధ్యేయంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

రాష్ట్రంలోనే మోడల్‌గా సోలార్ విద్యుత్తు ప్రాజెక్ట్

రాష్ట్రంలోనే మోడల్‌గా కుప్పంలో సోలార్ విద్యుత్తు ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టనున్నారు. కుప్పం మండలం నడిమూరు గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా తీసుకుని, అక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తారు. సంప్రదాయ ఇంధన వనరుల వినియోగంతో, వాతావరణ కాలుష్య నియంత్రణ చేసే క్రమంలో సోలార్ విద్యుత్తు ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉచితంగా విద్యుత్తు సరఫరా అవుతుందని అంటున్నారు కానీ, ఆ విషయంలో ఇంకా అధికారులెవరూ స్పష్టత ఇవ్వలేదు.

● రెండు పరిశ్రమలకు శంకుస్థాపన చేస్తారు. అందులో ఒకటి మదర్ డెయిరీ తరఫున సఫల్ పేరిట ఏర్పాటు చేసే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్. శాంతిపురం మండలం తమ్మిగానిపల్లెలో 40 ఎకరాల్లో ఏర్పాటు చేసే ఈ పరిశ్రమవల్ల నిత్యం ధరల పతనంతో అప్పులపాలయ్యే టమోటా రైతుకు మేలు చేకూరుతుంది. రెండోది శ్రీజ డైరీ మదర్ ప్లాంట్. ఇది కూడా తమ్మిగానిపల్లెలో మరో 40 ఎకరాల్లో ఏర్పాటు కానుంది. పాడి రైతులు ఈ డెయిరీతో లాభాల బాట పడతారు. ఇందులో మళ్లీ మహిళలే అధికంగా ఉంటారు.


నడిమూరులో సిద్ధమైన సీఎం సభా ప్రాంగణం

● అలీప్ ద్వారా మహిళా శక్తి భవన్‌కు శంకుస్థాపన చేయనున్నారు. పలార్లపల్లెలో ఏపీఐసీసీకి కేటాయించిన 18.70 ఎకరాలను అలీప్‌కు కేటాయించారు. ఇక్కడ మహిళా శక్తి భవన్‌తోపాటు, మహిళా పారిశ్రామికవాడను నిర్మించనున్నారు. దీనిద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణతోపాటు, వారు చేసే ఉత్పత్తులకు అవసరమైన యంత్రాలను అమర్చి, ఉచితంగా ఉత్పత్తి చేసుకునే సదుపాయ కల్పించనున్నారు.

● కుప్పం మున్సిపాలిటీలో రూ.92.20 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. కాలువల నిర్మాణం, రహదారులు, కూడళ్ల సుందరీకరణ, ఉద్యానవనాల అభివృద్ధి పనులు ఈ నిధులతో చేపడతారు. ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తారు. రూ.42.20 కోట్లతో కడా కార్యాలయం విస్తరణ పనులను కూడా ప్రారంభించనున్నారు.

● కుప్పం నియోజకవర్గ పరిధిలోని రహదారుల అభివృద్ధి కోసం తొలుత రూ.34.27 కోట్లు, మలి విడతలో రూ.19.08 కోట్లను కేటాయించారు. ఈ పనులను కూడా ప్రారంభిస్తారు.

● ఈజీమార్ట్ పేరుతో వెలుగు పథకంలోని మహిళా సమాఖ్య సభ్యులకు చిరు వ్యాపారాభివృద్ధికోసం ఒక పథకాన్ని ప్రారంభిస్తారు. కొత్తగా చిరు వ్యాపారులు పెట్టుకునే మహిళలకు, ఇప్పటికే చిరు వ్యాపారాలు చేస్తున్న మహిళలకు ఈ పథకం ద్వారా నేరుగా ఉత్పత్తి కంపెనీలనుంచే పలురకాల ఉత్పత్తులను అతి తక్కువ ధరకు అందిస్తారు.

● ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్డీసీ) పథకం ద్వారా మై స్టోర్ యాప్‌ను తీసుకొస్తున్నారు. ఈ యాప్‌లో ఇప్పటికే ఉన్న ఉత్పత్తులతోపాటు మహిళలు ఇప్పటికే కుటీర పరిశ్రమగా చేస్తున్న ఉత్పత్తులను కూడా ఉంచి మార్కెటింగ్ చేసుకునే సదుపాయం ఉంటుంది.

● మహిళా సమాఖ్యలకు రూ.50కోట్లకుపైగా రుణాలు అందివ్వనున్నారు. బ్యాంక్ లింకేజీలు, 50 లేదా 60 పైసలకే వడ్డీ రుణాలు వంటివాటికి సంబంధించిన చెక్కులను పంపిణీ చేస్తారు.

● ఇవిగాక ఇంకా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించే అవకాశం ఉంది.

నేడు సీఎం చంద్రబాబు రాక

సొంత నియోజకవర్గమైన కుప్పంలోనే మూడ్రోజుల పర్యటన

కుప్పం/చిత్తూరు కలెక్టరేట్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో మూడ్రోజుల పర్యటన నిమిత్తం సోమవారం జిల్లాకు రానున్నారు. ఈ మేరకు పర్యటన వివరాలను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11.50 గంటలకు బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి కుప్పంలోని ద్రావిడ యూనివర్సిటీ ఇందిరా స్టేడియంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటలకు ద్రావిడ యూనివర్సిటీ ఆడిటోరియం చేరుకుని స్వర్ణకుప్పం విజన్-2029 ఆవిష్కరిస్తారు. అక్కడే జరిగే చర్చావేదికలో పాల్గొంటారు. 2.25 గంటలకు నడిమూరు చేరుకుని సౌరవిద్యుత్‌ను ప్రారంభించి, లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు శీగలపల్లె గ్రామం చేరుకుని ప్రకృతి వ్యవసాయం చేసే రైతులతో సంభాషిస్తారు. ప్రకృతి వ్యవసాయం విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ, ఎన్‌వోసీఎల్‌తో ఎంవోయూ కార్యక్రమంలో పాల్గొంటారు. 5.55 గంటలకు ద్రావిడ వర్సిటీ ఆడిటోరియం చేరుకుని అక్కడ జరిగే సమావేశంలో పాల్గొన్నాక కుప్పం ఆర్‌అండ్‌బీ అతిథిగృహం చేరుకుని రాత్రిబస చేస్తారు. 7న ఉదయం 10గంటలకు కుప్పం ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నుంచి బయల్దేరి టీడీపీ కార్యాలయానికి చేరుకుని 'జననాయకుడు సెంటర్' ప్రారంభించి ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 12.20 గంటలకు కంగుంది గ్రామం చేరుకుని దివంగత శ్యామన్న విగ్రహావిష్కరణ చేశాక 1.20 గంటలకు కుప్పంలో ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ చేరుకుంటారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 5.05 గంటలకు శాంతిపురం మండలం కడపల్లె వద్ద సొంతింటి నిర్మాణాన్ని పరిశీలిస్తారు. 6.10 గంటలకు ద్రావిడ యూనివర్సిటీ చేరుకుని అకడమిక్ బిల్డింగ్‌లోని కెరీర్ రెడీనెస్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. యూనివర్సిటీలో జిల్లా అధికారులతో సమీక్షిస్తారు. రాత్రి ఆర్‌అండ్‌బీ అతిథిగృహానికి చేరుకుని బసచేస్తారు. 8వ తేదీ ఉదయం ద్రావిడ వర్సిటీలోని హెలిపాడ్ నుంచి హెలికాప్టర్ ద్వారా అమరావతి బయల్దేరి వెళ్తారని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్‌ఎస్' రద్దు

చిత్తూరు అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటన ఉండటంతో సోమవారం కలెక్టరేట్‌లో జరగాల్సిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా కేంద్రానికి రావద్దని సూచించారు.

పోలీసు కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరగాల్సిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని సీఎం పర్యటన కారణంగా రద్దు చేసినట్లు ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత ప్రజలు వ్యయప్రయాసలు కోర్చి జిల్లా కేంద్రానికి రావద్దని సూచించారు.

'కానిస్టేబుల్' ఎంపిక ప్రక్రియలో స్వల్ప మార్పు

చిత్తూరు అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియలో స్వల్ప మార్పు చోటు చేసుకుంది. ఏపీ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదేశాల ప్రకారం ఈనెల 7,8తేదీల్లో జరగాల్సిన శారీరక కొలత పరీక్షలు, సామర్థ్య పరీక్షలను వైకుంఠ ఏకాదశి పండుగ, ఇతర సమస్యల కారణంగా వాయిదా వేసినట్లు ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. వాయిదాపడ్డ ఈ పరీక్షలు ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. ఈ తేదీల్లో పరీక్షలకు హాజరవ్వాల్సిన అభ్యర్థులు, సవరించిన షెడ్యూల్‌ను గమనించాలని కోరారు. గతంలో ఇచ్చిన అడ్మిట్ కార్డే చెల్లుబాటు అవుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు పోలీసు వారి అధికారిక వెబ్‌సైట్ లేదా హెల్ప్‌లైన్ నెంబరు (94414 50639)ను సంప్రదించాలని సూచించారు.



ముగ్గులు వేస్తున్న మహిళలు




సంప్రదాయాలకు అద్దం పడుతున్న ముగ్గుల్లోని బొమ్మల కొలువులు


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా..

● 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన

చిత్తూరు సెంట్రల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ఆదివారం పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహించిన సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. పోటీలు ప్రారంభానికి గంట ముందే మహిళలు ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. పోటీల్లో మొత్తం 130 మంది పాల్గొన్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పోటీపడి చుక్కల ముగ్గులను రంగులతో అలంకరించారు. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా గొబ్బెమ్మలు, చెరకుగడలు, బొమ్మల కొలువులతో ముగ్గులను వేయడంతో సంక్రాంతి ముందే వచ్చిందా అన్న వాతావరణం నెలకొల్పారు. పోటీలను గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో నిర్వహించారు. లోకల్ స్పాన్సర్‌గా జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్, జీజేఎం సుఖీభవ ఏసీ మహల్ (చిత్తూరు) సహకారం అందించారు. ఈ పోటీలకు పీఎస్ఎన్ శ్రీవివేకానంద జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులు కూడా తరలిరావడం విశేషం. ఈ నేపథ్యంలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులకు ముగ్గులను ఎంపిక చేయడం న్యాయ నిర్ణేతలకు సవాలుగా మారింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, కలికిరి మురళీమోహన్‌లు మైదానమంతా కలియతిరిగి ముగ్గులను పరిశీలించి.. మహిళల్లో ఉత్సాహాన్ని నింపారు. లోకల్ స్పాన్సర్లతోపాటు విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ 2025 వార్షిక క్యాలెండర్ అందజేశారు. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ ఆధ్వర్యంలో ప్రతి మహిళకు తులసి మొక్క ఇచ్చారు. 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ఏటా నిర్వహించే ముగ్గుల పోటీలపై పలువురు మహిళలు తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా బ్యూరో ఇన్‌చార్జి షేక్ కరీముల్లా, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ మనోహరరెడ్డి, ఏడీవీటీ ఇన్‌చార్జి విద్యాసాగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్, ఏసీవో జనార్థన్, పీసీ ఇన్‌చార్జి రమేష్‌బాబు, సీనియర్ రిపోర్టర్లు సుభాష్‌బాబు, జయకర్, చందు, నవీన్, రామ్మూర్తి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.


కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న తేజశ్రీ, పొన్నియమ్మ, పవిత్ర, కళావతి


స్పాన్సర్ల లోగోలు

తిరుపతిలో ఉత్సాహంగా..

తిరుపతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. లోకల్ స్పాన్సరర్‌గా చిల్లీస్ రెస్టారెంట్స్ అధినేత అంజి వ్యవహరించారు. ఈ పోటీల్లో 106 మంది మహిళలు, విద్యార్థినులు పాల్గొని ముగ్గులు వేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో తిరుపతిలోని కొర్లగుంటకు చెందిన ఎం.విద్య, నీలమణి (భవానినగర్), కె.ప్రమీల (ఎస్టీవీనగర్) నిలిచారు. విజేతలకు అతిథులైన మున్సిపల్ కమిషనరు మౌర్య, చిల్లీస్ అంజి బహుమతులు అందజేశారు.


తిరుపతిలో ముగ్గు వేస్తున్న విద్య

పత్రపల్లె వద్ద ఒంటరి ఏనుగు మకాం

సోమల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పత్రపల్లె సమీపంలో ఒంటరి ఏనుగు మకాం వేసి రాత్రి పంటలపై దాడులు చేస్తుందని గ్రామస్తులు తెలిపారు. రాంపల్లె బీట్‌లో మకాం వేసిన ఏనుగు టమోటా, మామిడి తోటల్లో తిరగాడుతుందని తెలిపారు. మామిడి తోటల్లో కాయలు లేకపోవడంతో ప్రధానంగా నీలం రకం చెట్లను ధ్వంసం చేస్తోందని రైతులు వాపోతున్నారు. అరకొరగా సాగులో ఉన్న టమోటా తోటల్లో పంటలను తొక్కేస్తుందని చెప్పారు.


టమోటా తోటలో ఏనుగు పాదముద్రలు

నేటినుంచి కాణిపాక ఆలయ ప్రచార రథం పర్యటన

ఐరాల(కాణిపాకం), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రచార రథం సోమవారం నుంచి పర్యటించనున్నట్లు ఈవో పెంచలకిషోర్ ఆదివారం తెలిపారు. ఈనెల 12వ తేదీ వరకు జిల్లాలోని అన్ని పట్టణాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజనవాడల్లో పర్యటించి అక్కడ స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడే ఓటర్ల తుది జాబితా విడుదల

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా సంక్షిప్త సవరణ - 2025 తుది జాబితా సోమవారం కలెక్టరేట్‌లో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టర్ సుమిత్ కుమార్ విడుదల చేస్తారు. అక్టోబరు 29న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించగా, ప్రజలనుంచి నవంబరు 28వరకు అభ్యంతరాల స్వీకరణ జరిగింది. మార్పులు - చేర్పులు, తొలగింపులకోసం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ద్వారా 1.32 లక్షల మేర అభ్యంతరాలు వినతుల రూపంలో అందాయి. వాటిలో 40,107 తిరస్కరించగా, 92,117 వినతులు ఆమోదించారు. వాటి పరిశీలన పూర్తిచేసి సోమవారం తుది జాబితాను విడుదల చేయనున్నారు.

కుప్పం రోడ్ల అభివృద్ధికి రూ.19 కోట్లు మంజూరు

కుప్పం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ రోడ్ల అభివృద్ధికి రూ.19.08కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. కుప్పం-పలమనేరు రోడ్డు నుంచి శాంతిపురం మండలం రాళ్లబూదుగూరు మీదుగా కేజీఎఫ్ సరిహద్దు దాకా రోడ్డు నిర్మాణానికి రూ.4.05 కోట్లు, కుప్పం-గుడుపల్లె రోడ్డునుంచి గుడుపల్లె మండలం గుండ్లసాగరం-పొగురుపల్లెల మీదుగా కర్ణాటక సరిహద్దు దాకా రూ.6.02 కోట్లు, కుప్పం-పెద్దపర్తికుంటకు రూ.5.16 కోట్లు, రామకుప్పం-విజలాపురం రోడ్డుకు రూ.3.85 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు.

తిరుమలేశుడి సేవలో నటి మీనాక్షి చౌదరి

తిరుమల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం వంటి చిత్రాల్లో నటించిన మీనాక్షి చౌదరి.. ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్న ఆమెకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా, ఆలయ సిబ్బంది లడ్డూప్రసాదాలు అందజేశారు.



శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం నాటి హుండీ ఆదాయం రూ.3.26 కోట్లు రాగా, శనివారం శ్రీవారిని 71,990 మంది భక్తులు దర్శించుకోగా, 21,205 మంది తలనీలాలు సమర్పించారు.

సైనిక్, నవోదయ ప్రవేశపరీక్షల శిక్షణకు కేరాఫ్ విశ్వం

● 13న సైనిక్ ప్రవేశపరీక్ష దరఖాస్తుకు చివరి గడువు

● కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి

తిరుపతి(విద్య), జనవరి 5(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో జాతీయ స్థాయిలో నిర్వహించే సైనిక్, నవోదయ, మిలటరీ ప్రవేశపరీక్షలకు తిరుపతిలోని విశ్వం పోటీ పరీక్షల శిక్షణా కేంద్రం కేరాఫ్‌గా నిలుస్తోందని సంస్థ ఛైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. వరదరాజనగర్‌లోని స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై జాతీయ స్థాయి పోటీ పరీక్షలపై సందేహాలను నివృత్తి చేసుకున్నారని వెల్లడించారు. 34 సంవత్సరాలుగా తమవద్ద శిక్షణ పొందిన ఎందరో విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని వివరించారు. గతేడాది 6, 9తరగతులు సైనిక్ ప్రవేశ పరీక్షల్లో ఏపీలో మొదటి ర్యాంకుతోపాటు మొత్తంగా 61మంది విద్యార్థులు సీట్లు సాధించి సంచలన ఫలితాలు నమోదు చేశారని తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి సైనిక్ స్కూల్స్ ప్రవేశపరీక్ష దరఖాస్తుకు ఈనెల 13న గడువు ముగుస్తుందని, ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 8688888802/ 9399976999లను సంప్రదించాలని కోరారు.


విశ్వనాథరెడ్డి

సీఎం పర్యటనకు సర్వం సిద్ధం


- కుప్పంలో ఎమ్మెల్సీ కంచర్ల, కలెక్టర్, ఎస్పీల పర్యవేక్షణ

కుప్పం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన కోసం అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. సీఎం పర్యటించనున్న ప్రాంతాల్లో ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠ, కడా పీడీ వికాస్ మర్మత్, జేసీ విద్యాధరిలతోపాటు పలువురు జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులు పరిశీలించారు. ఏర్పాట్లను తనిఖీ చేసి, లోటుపాట్లను సవరించి తగు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. భద్రతా ఏర్పాట్లను సైతం పర్యవేక్షించారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందీ రాకుండా ముఖ్యమంత్రి పర్యటన సజావుగా జరిగేలా చూడాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.



ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, పోలీసు బలగాలకు సూచనలిస్తున్న ఎస్పీ మణికంఠ




సీఎం రాకకు సిద్ధమైన ఎన్టీఆర్ మెమోరియల్ స్టేడియం, వేదిక ఏర్పాట్లు, కుప్పంలో విద్యుత్తు వెలుగుదారులు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- మినీ లారీని ఢీకొని డివైడర్‌పైకి దూసుకెళ్లి ఆగిన కర్ణాటక ఆర్టీసీ బస్సు

- 31 మంది ఓంశక్తి భక్తులకు స్వల్ప గాయాలు

బంగారుపాళ్యం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని మొగిలి ఘాట్‌లో ఆదివారం పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన 56 మంది ఓంశక్తి భక్తులు తమిళనాడు రాష్ట్రంలోని మేల్‌మరవత్తూరుకు ఆర్టీసీ బస్సులో బయల్దేరారు. మార్గమధ్యంలో మొగిలి ఘాట్‌లోని దొరచెరువు సమీపానికి వచ్చేసరికి ముందు వెళుతున్న మినీ లారీని వెనుక నుంచి కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఆపై డివైడర్‌పైకి దూసుకెళ్లి ఆగింది. దీంతో బస్సులోని 31మంది ఓంశక్తి భక్తులకు స్వల్పంగా గాయాలయ్యాయి. గాయపడ్డ వారిలో.. నీలమ్మ, పద్మ, మాధవి, సుమిత్ర, సరోజమ్మ, జ్యోతి, బైరెడ్డి, వరలక్ష్మి, రూప, నాగరత్నమ్మ, మునెమ్మ, రత్నమ్మ, గిరిజ, అనిల్, రక్ష, పద్మ, రాణి, మంజుల, నందిని, శ్రీనాథ్, మునెమ్మ, అరుంధతి, స్వర్ణమ్మ, నందిని, మనోజ్, అనిల్‌తోపాటు మరో ఐదుగురు ఉన్నారు. బాధితులను 108 వాహనం ద్వారా బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్సలు అందించారు. ఏఎస్ఐ మల్లప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్ దాటి అవతలి రోడ్డుపైకి వెళ్లుంటే..

కర్ణాటక బస్సు డివైడర్‌ను దాటి అవతలి రోడ్డుపైకి వెళ్లి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేది. గత ఏడాది సెప్టెంబరు 23వ తేదీన బెంగళూరు నుంచి ఐరన్ లోడుతో వస్తున్న లారీ ఇదేతరహాలో డివైడర్‌ను దాటి పలమనేరు వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో 11మంది మృత్యువాత పడ్డ విషయం తెలిసిందే.


డివైడర్‌పైకి దూసుకెళ్లి ఆగిన కర్ణాటక ఆర్టీసీ బస్సు

డివైడర్ ఎత్తు తక్కువ ఉండడం వల్లేనా?

డివైడర్ ఎత్తు తక్కువ ఉండడం వల్లే వాహనాలు అటువైపు రోడ్డులోకి దూసుకెళ్లి భారీ ప్రాణనష్టం జరుగుతోందని స్థానికులు అంటున్నారు.



అంబులెన్స్ కోసం ఎదురుస్తున్న క్షతగాత్రులు - బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యం

- ఏఎస్ఐపై ఎస్పీ ఆఫీసులో ఫిర్యాదు చేశానన్న రైతు

- సోషల్ మీడియాలో వీడియో వైరల్

పుంగనూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కూతురు ముందే ఏఎస్ఐ అసభ్యకరంగా దూషించి మానసిక క్షోభకు గురి చేశారని మురళీనాయక్ అనే రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమన్నాడు. ఈ మేరకు ఆదివారం సోషల్ మీడియాలో ఆయన పెట్టిన వీడియో వైరల్ అవుతోంది. 'మాది నల్లగుట్లపల్లె తాండా. నేను వ్యవసాయం చేస్తున్నాను. పొలం విషయమై బంధువు లీలావతితో గొడవ జరిగింది. ఆమె పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై నన్ను ఏఎస్ఐ మహేంద్ర పోలీస్ స్టేషన్‌కు పిలిచారు. విచారణ సందర్భంగా నా కుమార్తె ముందే దుర్భాషలాడుతూ విరుచుకుపడ్డారు. తప్పు చేస్తే కేసుపెట్టి జైలుకు పంపాలని, బిడ్డ ముందు అసభ్యంగా తిట్టవద్దంటూ ప్రాధేయపడినా వినలేదు. నన్ను కులంపేరుతో తిట్టారని సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదుచేశాను. చిత్తూరు ఎస్పీకి ఫిర్యాదుచేయడానికి వెళితే అక్కడ ఎస్పీ లేరని చెప్పడంతో ఆఫీసులో ఫిర్యాదుచేశాను' అంటూ వీడియోలో మురళీనాయక్ ఆవేదన వ్యక్తం చేశాడు.


వీడియోలో ఆవేదన వ్యక్తం చేస్తున్న మురళీనాయక్

తిరుపతిలో బ్లేడు బ్యాచ్ హల్‌చల్

తిరుపతి(నేరవిభాగం), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం బ్లేడు బ్యాచ్ హల్‌చల్ చేసింది. గోవిందరాజస్వామి ఆలయం వద్ద దారాలు, దండలు, పూసలు విక్రయించే కర్ణాటక రాష్ట్రానికి చెందిన వెంకటేష్ బాబుపై పలువురు వ్యక్తులు దాడి చేసి పారిపోయారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు తీవ్ర గాయాలైన వెంకటేష్ బాబును తిరుపతి రుయాకు తరలించారు.

బకాయిలు చెల్లించకుంటే ఉద్యమం తప్పదు

● ఎస్టీయూ రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు

వెదురుకుప్పం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న పాత బకాయిలు 'సంక్రాంతి'లోపు చెల్లించకపోతే ఉద్యమం తప్పదని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం కార్వేటినగరంలో హిందూ ముస్లిం కల్యాణ మండపంలో 78వ జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పొదుపు చేసుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐలకు సంబంధించి రుణాలు, తుది చెల్లింపులు, సంపాదిత సెలవులు, నగదు చెల్లింపు బకాయిలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సహాధ్యక్షుడు గంటా మోహన్ మాట్లాడుతూ.. 2023 జూలై నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 12వ వేతన సవరణ అమలు చేయాల్సి ఉందన్నారు. బకాయి పడిన డీఏలు చెల్లించకపోగా.. ఒకటో తేదీన జీతాలు చెల్లింపు సైతం జాప్యం చేస్తూ గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శి అరగొండ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టడానికి ప్రభుత్వం చట్టం చేస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. 117జీవో రద్దుతో పాటు ఇంగ్లీషు మీడియంతోపాటు తెలుగు మీడియం కూడా అవకాశం కల్పించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బోడే మోహన్, ఆర్థిక కార్యదర్శి తన్నీరు యువరాజు తమ నివేదికలను జిల్లా కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర నాయకులకు సమర్పించారు. కార్వేటినగరానికి చెందిన ఎస్టీయూ యువ నాయకుడు పవన్‌కుమార్‌రెడ్డి మృతి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, రాష్ట్ర నాయకులు మునెప్పమొదలి, పురుషోత్తం, ఇలియాస్, జగన్మోహన్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, దేవరాజులురెడ్డి, రమణారెడ్డి, జిల్లా నాయకులు సర్ధార్, ఆటుకారు చంద్రశేఖర్, న్యాంతుల్లా, నాగేంద్ర, అమరనాథ్, వేణు, నరేష్, టీఎం సుబ్రహ్మణ్యం, హరిబాబు, నగరి డివిజన్ కన్వీనర్ గిరి, కార్వేటినగరం మండల అధ్యక్షుడు దేవయ్య, ప్రధాన కార్యదర్శులు గురవయ్య, కార్తికేయలు తదితరులు పాల్గొన్నారు. కాగా, కార్వేటినగరం పురవీధుల్లో ఎరుపు జెండాలతో నాయకులు ర్యాలీ నిర్వహించారు.


కార్వేటినగరంలో ర్యాలీ చేస్తున్న ఎస్టీయూ నాయకులు

జగన్ విధానాలతోనే పార్టీ మునిగింది

● సత్యవేడు నియోజకవర్గ వైసీపీ ఆత్మీయ సమావేశంలో నేతల ధిక్కార స్వరం

సత్యవేడు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): 'కార్యకర్తలను పట్టించుకోకుండా జగన్ వన్‌మ్యాన్ షోలాగా వ్యవహరించారు. ఆయన చేపట్టిన ఏకపక్ష విధానాలతోనే వైసీపీ మునిగింది' అని పార్టీ నేతలు కుండబద్దలు కొట్టారు. సత్యవేడులో ఆదివారం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి సమక్షంలోనే నాయకులు జగన్‌పై నిరసన స్వరం వినిపించారు. ప్రధానంగా నాగలాపురం జడ్పీటీసీ సభ్యుడు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అధికారంలో ఉన్న ఐదేళ్లు కార్యకర్తలకు న్యాయం చేయలేక పోయామన్నారు. ఐప్యాక్ టీం, వలంటీర్ వ్యవస్థను నమ్ముకుని కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్లే ఓటమి చవిచూడాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా కార్యకర్తల మనోభావాలు గౌరవించమని జగన్‌కు చెప్పండంటూ భూమనకు సూచించారు. నియోజకవర్గంలోని నాయకులు కడుపులో కత్తులు పెట్టుకుని పైకి ఐక్యతారాగం వినిపిస్తున్నారని కేవీబీపురానికి చెందిన ఓ నేత అన్నారు. మరికొందరు నేతలు కూడా ఇవే అంశాలను ప్రస్తావించారు. కడుపులో ఉన్న కత్తులను నూరకుండా, పార్టీ బలోపేతం కోసం పనిచేద్దామని ఇన్‌చార్జి రాజేష్ అభ్యర్థించారు. తమ కడుపులో ఉన్న కత్తులను సానబెట్టి, ఆ కత్తులను టీడీపీపైకి విసరండని కరుణాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. తాను జగన్‌తో మాట్లాడి కార్యకర్తలకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. నాయకులు సుశీల్‌కుమార్‌రెడ్డి, బీరేంద్రవర్మ, నిరంజన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సోమశేఖర్, దయాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, చిన్న, సురేష్, అపరంజిరాజు, చిన్నదురై, హరిశ్చంద్రారెడ్డి, భాస్కర్‌నాయుడు, క్రిష్ణయ్య, మాధవి, సొరకాయలు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి ప్రస్తావనేదీ?

వైసీపీ ఆవిర్భావం నుంచీ నియోజకవర్గంలో ఏ చిన్న కార్యక్రమం జరిగినా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పొగడ్తలతో ముంచెత్తే ఆపార్టీ నాయకులు.. ఈ సమావేశంలో ఆయన్ను ప్రస్తావించకపోవడం చర్చనీయాంశంగా మారింది. పెద్దిరెడ్డి సైతం నియోజకవర్గంలో అన్నీతానై పార్టీని నడిపించారు. నియోజకవర్గ ఇంచార్జ్ రాజేష్, ఎంపీ గురుమూర్తి మాత్రమే తమ ప్రసంగంలో పెద్దిరెడ్డిని ప్రస్తావించారు.

45 మందికి ఉచిత నేత్రపరీక్షలు



పలమనేరు, జనవరి5 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు రిక్రియేషన్ క్లబ్ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్రచికిత్సా శిబిరంలో 45 మందికి నేత్రపరీక్షలు నిర్వహించారు. చెన్నై శంకర నేత్రాలయ నేత్రవైద్యులు పరీక్షలు నిర్వహించారు. అందులో 23 మందికి ఆపరేషన్లు అవసరమున్నట్లు గుర్తించారు. వారికి ఉచితంగా చెన్నై శంకరనేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని నేత్రవైద్యులు మురళి చెప్పారు. చెన్నై వెళ్లి రావడానికి ఉచిత వాహన సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



పలమనేరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం కొత్త సంవత్సర డైరీని ఆ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు గురురాజారావు ఆవిష్కరించారు. డైరీలో ప్రభుత్వ ఉత్తర్వులు, పెన్షన్‌రూల్స్ తేదీలు తదితర వివరాలు ముద్రించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు 2018 జూలై నుంచి 2023 జూలైవరకు డీఆర్ బకాయిలు, 2020 ఏప్రిల్‌నుంచి 2021డిసెంబరు వరకు పీఆర్‌సీ బకాయిలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ ఉత్తర్వులు సవరించి 70 సంవత్సరాలు పూర్తయిన వారికి 10 శాతం, 75 సంవత్సరాలు పూర్తయినవారికి 15 శాతం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గౌస్, ఆర్ముగం, సుబ్రమణ్యం, ఆంజప్ప, గురుస్వామి నాయుడు, మాలతి, నాగభూషణం, మస్తాని, భద్రమ్మ, అక్బర్‌భాషా పాల్గొన్నారు.

దివ్యాంగులకు పరికరాల అందజేత



వికలాంగులకు పరికరాలు పంపిణీ చేస్తున్న చల్లారామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, జనవరి 5(ఆంధ్రజ్యోతి) వికలాంగులను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం రొంపిచెర్లలో దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి దాదిశ్రీను ఆధ్వర్యంలో ఆదివారం ఆయన స్వగృహంలో చల్లాబాబుకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో సుమారు 2500 మంది దివ్యాంగులు ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. చల్లారామచంద్రారెడ్డి స్పందిస్తూ ప్రభుత్వపరంగా న్యాయం జరిగే చర్యలు తీసుకుంటానన్నారు. దివ్యాంగులకు ఆయన చేతుల మీదుగా వీల్‌చేర్సు, వినికిడి యంత్రాలు, చేతి కర్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.ఇబ్రహీం ఖాన్, ఇమ్రాన్‌ఖాన్, ఇర్షాద్, కార్యదర్శి రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్.బెస్తపల్లిలో తాగునీటి కష్టాలు



ట్యాంక్ నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

రొంపిచెర్ల,జనవరి 5 (ఆంధ్రజ్యోతి) తమ తాగునీటి కష్టాలు తీర్చాలని ఆర్.బెస్తపల్లి గ్రామస్తులు కోరుతున్నారు. ఈగ్రామంలో 50 కుటుంబాలు ఉన్నాయి. వీరికి ప్రభుత్వం గతంలో బొలుగుండ చెరువులో బోరు వేసి మోటారు అమర్చింది. తద్వారా నీరు అందేది. ఇటీవల వర్షాలకు చెరువులో నీరు పెరిగి బోరు మోటారు మునిగిపోయింది. మోటరు కాలిపోయింది. దీంతో నీరు రాకపోవడంతో కష్టాలు మొదలయ్యాయి. నెల రోజులుగా ట్యాంక్ ద్వారా, చుట్టు పక్కల పొలాల బోర్ల నుంచి నీరు తెచ్చుకొంటున్నారు. అధికారులు స్పందించి మరో చోట బోరు వేయాలని కోరుతున్నారు.

పగటి పూటా వీధి దీపాల వెలుగులు !



సోమల, జనవరి5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పలు వీధుల్లో వీధిదీపాలు రాత్రి పగలు తేడా లేకుండా వెలుగుతుండటంతో స్థానికులు విస్తుపోతున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో వీధిదీపాలు పగటి పూట కూడా వెలుగుతున్నాయి. పంచాయితీకి అధిక బిల్లులు వస్తున్నా పట్టించుకోవడం లేదు. దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హైందవ శంఖారావానికి వీహెచ్‌పీ కార్యకర్తలు



సోమల నుంచి బస్‌లో వెళ్లిన కార్యకర్తలు

సోమల, జనవరి 5(ఆంధ్రజ్యోతి):: విజయవాడలో ఆదివారం జరిగిన హైందవశంఖారావం సభకు సోమల మండలం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు శనివారం రాత్రి బయలుదేరి వెళ్లారు. ఈసందర్భంగా సోమల బస్టాండ్‌లో జైశ్రీరాం నినాదాలతో హోరెత్తింది. పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, గట్టువారిపల్లె, దిడ్డివారిపల్లె, గన్నావారిపల్లె, మునిరెడ్డిగారిపల్లె నుంచి ప్రైవేటు వాహనాల్లో కార్యకర్తలు వెళ్లారు.

పలమనేరును కమ్మేస్తున్న పొగమంచు

పలమనేరు, జనవరి5 (ఆంధ్రజ్యోతి): పలమనేరును మూడు రోజులుగా పొగమంచు కమ్మేస్తోంది. ఉదయం నాలుగు గంటలనుంచే దట్టంగా అలుముకొంటోంది. పలమనేరులోనే కాకుండా ఇరువైపులా దాదాపు 5 కిలోమీటర్ల పొడవునా జాతీయ రహదారిపై కూడా తెల్లవారినా ఏమీ కనిపించడంలేదు. జాతీయ రహదారిపై వాహన డ్రయివర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని లైట్లు వేసుకొని కొందరు, ఫాగ్ లైట్లు వేసుకొని మరికొందరు వాహనాలను నెమ్మదిగా నడుపుతున్నారు. పొగమంచుకు చలిగాలులు తోడవ్వడంతో స్థానిక ప్రజలు వణికిపోతున్నారు. జనవరి నెలాఖరు వరకు పొగమంచు అగచాట్లు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సుబ్రహ్మణేశ్వరుడికి ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని కుమారగిరిపై వెలసిన వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అభిషేకాలు జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

భక్తి ప్రపత్తులతో పడిగట్ల పూజలు

చిత్తూరు కల్చరల్: గిరింపేట దుర్గానగర్ కాలని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం శాస్త్రగిరి అయ్యప్ప స్వామి భక్త బృందం భక్తి ప్రపత్తులతో అయ్యప్ప స్వామి పడిగట్ల పూజ నిర్వహించారు. ప్రముఖ చలనచరిత్ర పంపిణీదారుడు, నిర్మాత సిన్మా శ్రీధర్ విచ్చేసి స్వామివారికి పూజలు చేశారు.

పలమనేరు బాలాజీకి సన్మానం



పలమనేరు, జనవరి5 (ఆంధ్రజ్యోతి) : రచయిత పలమనేరు బాలాజీని ఆదివారం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ సెనేట్‌హాల్‌లో ఘనంగా సన్మానించారు. బీసీ సంఘర్షణ సమితి ఆయనకు బహుజన సామాజిక రచయిత పురస్కారాన్ని అందించారు. గిరిజన జీవితంలోని వ్యధలను కథలుగా మలచిన కథకుడు బాలాజి అని యూనివర్సిటీ ఓఆర్‌ఐ డైరెక్టర్ పీసీ వెంకటేశ్వర్లు అన్నారు.కార్యక్రమంలో బీసీ సంఘర్షణ సంఘ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మయ్య. సాకం ప్రభాకర్, తుడా ఉపకార్యదర్శి డాక్టర్ వెంకటనారాయణ, బీసీ విద్యార్థి సంఘ రాష్ట్రఅధ్యక్షులు భాస్కర్‌యాదవ్, ఎస్వీయూ అధ్యక్షుడు తిరుమలేశు తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లె నుంచి తిరుమలకు పాదయాత్ర



చౌడేపల్లె, జనవరి5:(ఆంధ్రజ్యోతి) : తిరుమలకు 200 మంది భక్తులు కాలినడకన బయలుదేరారు. ఆదివారం మండలంలోని ఏకొత్తకోట పంచాయతీ అగ్రహారానికి చెందిన ఆనందస్వామి ఆధ్వర్యంలో గోవింద మాలధారణ భక్తులు పాదయాత్రగా ముందుకు సాగారు. మూడురోజుల పాదయాత్ర అనంతరం తిరుమల చేరుకుని స్వామివారిని దర్శనం చేసుకుంటామన్నారు.

సోమల: కర్ణాటక నుంచి పలు భజన సంఘాల సభ్యులు, భక్తులు తిరుమల పాదయాత్ర చేస్తూ మార్గ మధ్యలోని ఆలయాల్లో పూజలు చేసి బస చేస్తున్నారు. ఆదివారం కైవారం, బేత్ మంగళ్, వడ్డిపల్లె క్రాస్‌కు చెందిన గోవిందమాల భక్తులు సోమల అభయాంజనేయస్వామి ఆలయం, వేంకటేశ్వరస్వామి పాదాల ఆలయ సముదాయంలో బస చేసి పూజలు జరిపారు.

కపాడమిట్టపల్లెలో ఉచిత వైద్య పరీక్షలు



పుంగనూరు రూరల్, జనవరి5 (ఆంధ్రజ్యోతి):తిరుపతిలో రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం కుమ్మరనత్తం పంచాయతీ కపాడమిట్టపల్లె సచివాలయంలో 100మంది రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రిషీద్ ఆధ్వర్యంలో రక్తపరీక్షలు, బీపీ, షుగర్, ఆర్థో,యూరాలజీ, న్యూరో,జ్వరం, మలేరియా, టైఫాయిడ్, ఊపిరితిత్తులు, చెవి ముక్కు, స్త్రీ సమస్యల పరీక్షించారు. 18మంది రోగులు ఆయాసం, తదితర సమస్యలపై ఉచిత సర్జరీ కోసం తిరుపతి వైద్యశాలకు తరలించారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యరేఖ పాల్గొన్నారు.

తమిళనాడులో రోడ్డు ప్రమాదం

తండ్రీకూతుర్ల దుర్మరణం



మృతుడు అంకయ్య (ఫైల్‌ఫోటో)

విజయపురం, జనవరి 5(ఆన్‌లైన్): తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలోని పాతార్కాడు ఆదిఆంధ్రవాడకు చెందిన అంకయ్య(27), అతని కుమార్తె మోక్షిత(4) మృతి చెందారు. పోలీసు కథనం మేరకు వివరాలు .... అంకయ్య తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో కనకమ్మ సత్రం(తమిళనాడు)కు కిరాణా సామగ్రి కోసం ద్విచక్రవాహనంలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారిని రఘునాథపురం వద్ద మినీవ్యాను ఢీకొంది. అంకయ్య, మోక్షిత తీవ్రంగా గాయపడ్డారు. చెన్నై జీహెచ్‌కు తరలించగా మార్గమధ్యలో మోక్షిత చనిపోయింది. చికిత్స పొందుతూ అంకయ్య ఆదివారం మృతి చెందాడు. భార్య రమ్య, మరో కుమార్తె పూర్ణిమ స్వల్ప గాయాలయ్యాయి.

మినీ వ్యాను బోల్తా



వెదురుకుప్పం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మినీవ్యాను అదుపు తప్పి బోల్తాపడిన ఘైనమిది. ఆదివారం పచ్చికాపల్లం నుంచి వెదురుకుప్పం వైపు మినీవ్యాను బయలుదేరింది. కొమరగుంట క్రాస్ రోడ్డుకు సమీపంలోకి వచ్చే సరికి అతివేగం వల్ల అదుపు తప్పింది. తలక్రిందులుగా బోల్తాపడింది. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఆ సమయంలో ఎదురుగా మరో వాహనం వస్తే పెద్ద ప్రమాదం జరిగేదని అక్కడివారు చెప్పారు.

ఆత్మహత్యకు కారణమైన వారిని శిక్షించాలి

చిత్తూరు అర్బన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మోహనాచ్చారి ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు దయానందాచ్చారి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెనుమూరు మండలం గుండ్యానంపల్లెకు చెందిన మోహనాచ్చారి వడ్రంగి పనిచేస్తూ భార్య, బిడ్డలను పోషించుకునే వాడని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మోహనాచ్చారి కుటుంబంలో గుంటిపల్లె సచివాలయ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ సురేంద్ర చిచ్చురేపాడని తెలియ జేశారు. ఈ క్రమంలో గత నెల 22వ తేదీ క్వారీపై నుంచి దూకి మోహనాచ్చారి ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తుచేశారు. తన ఆత్మహత్యకు సచివాలయ ఉద్యోగి సురేంద్ర కారణమని సెల్‌ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టాడని వివరించారు. అయినా ఇంతవరకు మోహనాచ్చారి మృతికి కారణమైన వారిని అరెస్టు చేయలేదని, ఎస్పీ మణికంఠ చొరవ తీసుకుని బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

వాకింగ్ ట్రాక్ ఆక్రమిస్తున్నా పట్టించుకోరా..?





కాలువ ఆక్రమించి వాకింగ్ ట్రాక్ మూసివేశారిలా- ట్రాక్‌పై అక్రమ నిర్మాణాలు

పుంగనూరు, జనవరి5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల పుంగనూరులో పాదాచారులకు రోడ్డుపక్కన నిర్మించిన వాకింగ్ ట్రాక్ కొద్ది రోజులకే ఆక్రమణల బారినపడింది. అధికారుల పర్యవేక్షణ లోపం, ప్రభుత్వ స్థలం కావడంతో ఆక్రమణదారులకు హద్దులేకుండా పోయింది. కొందరు దుకాణాలు పెట్టుకున్నారు. మరికొందరు నీటి సంపులు, ఇళ్లకు దారి, తదితర అవసరాల కోసం నిర్మాణాలు చేపట్టారు. వాకింగ్ ట్రాక్‌పై ద్విచక్రవాహనాలు పార్క్ చేస్తున్నారు. మరికొందరు ఇనుప గ్రిల్స్ తొలగించి తమ అవసరాలకు ఉపయోగిస్తున్నారు. స్థానిక భీమగానిపల్లె నుంచి పలమనేరు రోడ్డులోని మదరస్సా వరకు రోడ్డుకు ఇరువైపులా లక్షలాది రూపాయలు వెచ్చించి ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశారు. ట్రాక్‌లో పలుచోట్ల దురాక్రమణలు జోరుగా జరుగుతున్నా మున్సిపల్, నేషనల్ హైవే అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు నడవటానికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు.

చంద్రబాబు పర్యటన జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సోమ, మంగళ వారాలలో రెండు రోజులపాటు జరిపే కుప్పం పర్యటనను విజయవంతం చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం ప్రజలను కోరారు. కంగుందిలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కుప్పంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతోపాటు శంకుస్థాపన చేస్తారన్నారు. సోలరైజేషన్ పథకాన్ని తొలుత కుప్పంనుంచే ప్రారంభిస్తారన్నారు. మాజీ సర్పంచ్ శ్యామన్న విగ్రహాన్ని ఆవిష్కరించడానికి వస్తున్న చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, గ్రామ పంచాయతీ సర్పంచి ధనశేఖర్, టీడీపీ కుప్పం మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, నాయకులు గోపీనాథ్, మంజునాథ్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు పార్కుకు పూర్వవైభవం

● చొరవ తీసుకున్న పలమనేరు పరిరక్షణ సమితి



పోలీసు పార్కులో క్రికెట్ ఆడుకొంటున్న పిల్లలు

పలమనేరు, జనవరి5 : పలమనేరు పోలీసు పార్కుకు పలమనేరు పరిరక్షణ సమితి పూర్వవైభవంకు తీసుకు వచ్చింది. 2002లో నాటి సీఐ ఖలీల్‌సౌదాగర్ పోలీసు స్థలాన్ని దాతల సహకారంతో పార్కుగా తీర్చిదిద్దారు. ఆయన తరువాత పార్కు నిర్వహణ గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఫలితంగా పార్కులో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. పిల్లల కోసం ఏర్పాటుచేసిన జారుడుబండ, ఏకంతూకం వంటి వస్తువులు తుప్పుపట్టి పాడైపోయాయి. వాకింగ్ ట్రాక్ సైతం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. వారం రోజుల క్రితం పలమనేరు పరిరక్షణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యంపిళ్లై, నరసింహులు, సభ్యులు చొరవ తీసుకున్నారు.దాతల సహకారంతో పార్కును వినియోగంలోకి తీసుకొచ్చారు. పిచ్చిమొక్కలను తొలగించి క్రీడాఉపకరణాలను ఏర్పాటు చేశారు. పార్కులో రెండురోజుల నుంచి సందడి మొదలయ్యింది.


జనసేనలో పలువురి చేరిక



జనసేనలో చేరిన వారితో వేణుగోపాల్‌రెడ్డి

పుంగనూరు రూరల్, జనవరి5(ఆంధ్రజ్యోతి): బండ్లపల్లె ఉప సర్పంచ్ రెడ్డెప్పరెడ్డితోపాటూ బండ్లపల్లె, నెక్కొంది, ఎ.కొత్తకోటకు చెందిన పలువురు జనసేన పార్టీలో చేరారు. ఆదివారం నల్లూరుపల్లెలో జరిగిన కార్యక్రమంలో వీరికి జనసేన నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి పార్టీ కండువాలుకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రాష్ట్రంలో అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని, అభివృద్ధి కార్యక్రమాలను ఎన్డీయే కూటమి ప్రభుత్వం ద్వారా ముమ్మరం చేస్తున్నారని వివరించారు. గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. జనసేన నాయకులు శివకుమార్‌రెడ్డి, విరూపాక్షి, చిన్నారాయల్, చైతన్యరాయల్, కుమార్, శంకర్‌రెడ్డి, హరి, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


భక్తులతో కిటకిటలాడిన బోయకొండ



ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ-దర్శనానికి క్యూలైన్లలో భక్తులు

చౌడేపల్లె, జనవరి5:(ఆంధ్రజ్యోతి)ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిట లాడింది. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, దూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచియే కాకా తమిళనాడు,కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టీచర్ల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న కోదండయాదవ్

చిత్తూరు సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల గురించి మాట్లాడే అర్హత మాజీ సీఎం జగన్‌కు లేదని టీడీపీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ పాలనలో హామీలు నెరవేర్చకుండా టీచరల్నుఉ అనేక రకాలుగా మోసం చేశారన్నారు. గత ప్రభుత్వంలో 17వ తేదీ వరకు జీతాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఉపాధ్యాయుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసి, మానసిక క్షోభకు గురిచేసిన జగన్‌కు నైతిక హక్కులేదన్నారు. ఉపాధ్యాయులు పొదుపు చేసుకున్న పీఎఫ్ ఫండ్‌ను కూడా పక్కదారి పట్టించారన్నారు. దాచుకున్న డబ్బు అందక టీచర్లు అనేక ఇబ్బందులకు గురైన విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలని చెప్పారు. ఉపాధ్యాయులతో మరుగుదొడ్ల శుభ్రత కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం రద్దుచేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నేతలు జయచంద్రనాయుడు, బాబు నాయుడు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో పలువురు ప్రముఖులు

ఐరాల(కాణిపాకం), జనవరి 5(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామిని దర్శించుకున్నవారిలో సత్యసాయి జిల్లా మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎమ్మెస్.రాజు, తెలంగాణ రాష్ట్ర అడిషినల్ డీజీపీ టెక్నికల్ సర్వీసెస్ వివి.శ్రీనివాసరావు ఉన్నారు. వీరు స్వామిని వేర్వేరుగా దర్శించుకున్నారు. వారిని ఎమ్మెల్యే మురళిమోహన్, ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వారిని వేదాశీర్వాద మండపంలో వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, కాణిపాకం ఎస్ఐ ధరణిధర పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం సర్కిల్‌గా గుర్తించండి



మినీబైపాస్‌రోడ్డులో అబ్దుల్‌కలాం సర్కిల్‌గా బోర్డు పెట్టిన ట్రస్టు సభ్యులు

పుంగనూరు, జనవరి5 (ఆంధ్రజ్యోతి): మినీ బైపాస్ రోడ్డును కలాం సర్కిల్‌గా గుర్తించాలని స్థానిక ఏపీజే అబ్దుల్ కలాం హెల్త్, ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ కోరారు. ఆదివారం మినీ బైపాస్ రోడ్డులోని దోబీకాలనీ సర్కిల్ వద్ద అబ్దుల్‌కలాం సర్కిల్ వద్ద బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే కలాం విగ్రహ ప్రతిష్ట ఏర్పాటు చేస్తామన్నారు. రాజకీయ నాయకులు, కౌన్సిలర్లు, కలాం సర్కిల్‌ను మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు నరసింహులు, అమర్, నారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల చెర నుంచి చెరువులను కాపాడాలి

పుంగనూరు, జనవరి5(ఆంధ్రజ్యోతి): చెరువులు, వంకలు, కుంటలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై వీఆర్వో నుంచి అధికారి స్థాయి వరకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అయూబ్ ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసినా స్పందించకపోవడంతో ప్రభుత్వ దురాక్రమణల పాలవుతున్నాయన్నారు. రెవెన్యూ సదస్సుల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. చెరువులు, కుంటలు, వంకల విస్తీర్ణాన్ని లెక్కకట్టి ఆక్రమణల నిగ్గు తేల్చాలని కోరారు.

గాండ్ల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

వెదురుకుప్పం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం గాండ్ల సంఘం క్యాలెండరును ఆ సంఘ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ఆవిష్కరించారు. తెలుగుదేశం పార్టీ కార్వేటినగరం మండల అధ్యక్షులు చెంగల్రాయుల యాదవ్, వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర మెంబరు రాజేంద్రరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జనార్థన్‌రాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గణిత ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది

చిత్తూరు సెంట్రల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో గణిత ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళిమోహన్‌లు అన్నారు. ఏపీ గణిత ఫోరం చిత్తూరు జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక విజయం డిగ్రీ కళాశాలలో గణిత ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ అన్ని సబ్జెక్టుల కంటే గణితం ఉత్తమమైనదన్నారు. వెయ్యి దశాంశ స్థానాలు తెలిపిన మంగళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని లహరికి ఎమ్మెల్యేలు రూ.50 వేలు, ఏపీ మ్యాథ్స్ ఫోరానికి రూ.50 వేలు విరాళం ప్రకటించారు. ఏపీఎంఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణశివప్రసాద్, ఉమ్మడి చిత్తూరు జిల్లాల నుంచి గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శబరిమలైకు సైకిల్‌యాత్ర



యాదమరి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాల ధరించిన ఓ భక్తుడు సైకిల్ మీద శబరిమలకు బయలుదేరాడు. బాపట్ల జిల్లా చీరాలకు చెందిన పాకాల పాండు టీడీపీ అభిమాని. గతేడాది ఎన్నికల్లో టీడీపీ విజయం సాధిస్తే సైకిల్ మీద శబరిమల వచ్చి అయ్యప్పస్వామిని దర్శించుకుంటానని మొక్కుకున్నాడు. ఈ క్రమంలో బయలుదేరిన పాండు ఆదివారం యాదమరి మండల సమీపంలో కనిపించాడు.

మొక్కుబడిగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు..!



వెదురుకుప్పం మండల కేంద్రంలో ఓ ఇల్లు ఆక్రమణలో ఉందని ఇటీవల కూల్చారు. తాజాగా ఆ ప్రాంతంలో గ్రామ కార్యదర్శి పేరిట హెచ్చరిక బోర్డు పెట్టారు. ఆ బోర్డులో 'వెదురుకుప్పం లెక్కదాఖల సర్వే నంబరు-239లోగల చెరువు నందు, చెరువుకు చెందిన ప్రభుత్వ స్థలంలో ఎలాంటి ఆక్రమణలు చేయరాదు. చేసినచో చట్టరీత్యా చర్యలు తీసుకోబడును' అని రాసి పెట్టారు. అయితే అందులో ఆ సర్వే నంబరులో ఎంత విస్తీర్ణంలో చెరువు ఉంది వంటి వివరాలు లేవు. ఇంకా ఆక్రమణలు ఉన్నా గుర్తించలేదని అందుకే పూర్తి వివరాలు లేకుండా మొక్కుబడిగా బోర్డు ఏర్పాటు చేశారని స్థానికులు చర్చించుకుంటున్నారు. - వెదురుకుప్పం, (ఆంధ్రజ్యోతి)

గణిత ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది



విద్యార్థిని లహరికి రూ.50వేలు చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యేలు

చిత్తూరు సెంట్రల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో గణిత ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళిమోహన్‌లు అన్నారు. ఏపీ గణిత ఫోరం చిత్తూరు జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక విజయం డిగ్రీ కళాశాలలో గణిత ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యేలు మాట్లాడుతూ అన్ని సబ్జెక్టుల కంటే గణితం ఉత్తమమైనదన్నారు. గణితంతో ఉన్నత స్థాయికి చేరే అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. వెయ్యి దశాంశ స్థానాలు తెలిపిన మంగళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని లహరికి ఎమ్మెల్యేలు రూ.50 వేలు, ఏపీ మ్యాథ్స్ ఫోరానికి రూ.50 వేలు విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణశివప్రసాద్, రాష్ట్ర టెక్నికల్ కమిటీ సభ్యులు తులసీ, మహిళా విభాగం అధ్యక్షురాలు జయంతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల నుంచి గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మా సత్కారానికి రండి

రాష్ట్ర విప్‌కి 'జనసేన' ఆహ్వానం



వెదురుకుప్పం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే థామస్‌కి రాష్ట్ర ప్రభుత్వ విప్ పదవి దక్కిన నేపథ్యంలో జనసేన పార్టీ తరపున సత్కార కార్యక్రమాన్ని చేపడుతున్నామని.. ఆ సత్కారానికి రావాలని జనసేన పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి యుగంధర్, కార్వేటినగరం మండలం కేపీ అగ్రహారం సర్పంచ్ కామసాని శేఖర్‌రెడ్డి ఆదివారం ఎమ్మెల్యేని చెన్నైలో కలసి ఆహ్వానించారు. ఈ నెల 19వ తేదీన ఎస్‌ఆర్‌పురంలో సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, వస్తామని చెప్పారని ఆ నాయకులు ఆదివారం తెలిపారు.

పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి



పెన్షనర్ల సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

చిత్తూరు కల్చరల్, జనవరి5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పెన్షనర్ల డిమాండ్‌లు నెరవేర్చాలని జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు కోరారు. ఆదివారం స్థానిక రెవెన్యూ భవన్‌లో ప్రభుత్వ పెన్షనర్ల సర్వసభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం అధ్యక్షులు నాగరాజన్ మాట్లాడుతూ కమిటేషన్, ఇంక్రిమెంట్ పునరుద్ధరణ తదితర చర్యలు వెంటనే చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మానందనం, కుమారవర్మ, లక్ష్మయ్య, ప్రభాకర్‌నాయుడు పాల్గొన్నారు.

అండగా ఉంటా అధైర్యపడకండి : భానుప్రకాష్



నగరి , జనవరి5(ఆంధ్రజ్యోతి): నగరి మండలం తడుకుపేట గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగిన ఘర్షణలో గాయపడిన టీడీపీ కార్యదర్శి పురుషోత్తం నాయుడు కార్యకర్తలు రాజేష్, బాలాసీలను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదివారం పరామర్శిం చారు. కొందరు రెచ్చగొట్టడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలాజీ, సురేష్‌నాయుడు, బాలాజీ, వంశీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

తడుకుపేటలో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలి: సీపీఐ



సమావేశంలో ప్రసంగిస్తున్న కోదండయ్య

నగరి, జనవరి5(ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని తడుకుపేటలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. తడుకుపేటలో ఏర్పడిన ఘర్షణ వాతావరణం దురదృష్టకరమని, సంఘటనలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దళితులపై దాడిచేసిన వారిని శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళి, సతీష్, ప్రకాష్, వివేక్, రంజిత్ పాల్గొన్నారు.

ముళ్లచెట్లతో మూసుకుపోయిన దారి



వీఎస్.అగ్రహారం చెరువు కట్టపై ఉన్న ముళ్లచెట్లు

ఐరాల,జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వీఎస్‌అగ్రహారం వద్ద ఉన్న చెరువు కట్టపై ముళ్లచెట్లు పెరిగిపోయి దారి చాలావరకు మూసుకుపోయింది. ప్రజలు, వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గం ద్వారా దివిటివారిపల్లె, 35యర్లంపల్లె, జంగాలపల్లె తదితర గ్రామాల నుంచి ప్రజలు నిత్యం ఐరాలకు విచ్చేస్తుంటారు. ముళ్ల చెట్లు రోడ్డుపై రావడంతో వాటికున్న ముళ్లు తగిలి ఇప్పటికే చాలామందికి గాయాలయ్యాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి ఈ మార్గంలో ఉన్న ముళ్ల చెట్లను తొలగించ వలసిన అవసరం ఎంతైనా ఉంది.

రక్తదానం ప్రాణదానంతో సమానం

చిత్తూరు సెంట్రల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని దేవి బాలమందిర్ కరస్పాండెంట్ సుజాత అన్నారు. పాఠశాల వ్యవస్థాపకులైన దివంగత త్యాగరాజన్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం పాఠశాల ప్రాంగణంలో 18వ రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన 40 మందిని యాజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, దాతలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న ఈవో

ఐరాల(కాణిపాకం), జనవరి 5(ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కాణిపాకం బస్టాండు వద్ద ఈ వైద్య శిబిరాన్ని చిత్తూరుకు చెందిన వాణి చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో నిర్వహించారని ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఈ శిబిరం ద్వారా పలువురు భక్తులు సేవలందుకున్నట్లు తెలియజేశారు. ఆలయ ఏఈవో రవీంద్రబాబు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు కారణమైన వారిని శిక్షించాలి

చిత్తూరు అర్బన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మోహనాచ్చారి ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు దయానందాచ్చారి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెనుమూరు మండలం గుండ్యానంపల్లెకు చెందిన మోహనాచ్చారి వడ్రంగి పనిచేస్తూ భార్య బిడ్డలను పోషించుకునే వాడని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మోహనాచ్చారి కుటుంబంలో గుంటిపల్లె సచివాలయ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ సురేంద్ర చిచ్చురేపాడని తెలియజేశారు. ఈ క్రమంలో గత నెల 22వ తేదీ క్వారీపై నుంచి దూకి మోహనాచ్చారి ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తుచేశారు. తన ఆత్మహత్యకు సచివాలయ ఉద్యోగి సురేంద్ర కారణమని సెల్‌ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టాడని వివరించారు. అయినా ఇంతవరకు మోహనాచ్చారి మృతికి కారణమైన వారిని అరెస్టు చేయలేదని, ఎస్పీ మణికంఠ చొరవ తీసుకుని బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని కుమారగిరిపై వెలసిన వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అభిషేకాలు జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

గాండ్ల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండరును ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

వెదురుకుప్పం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం గాండ్ల సంఘం క్యాలెండరును ఆ సంఘ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ఆవిష్కరించారు. తెలుగుదేశం పార్టీ కార్వేటినగరం మండల అధ్యక్షులు చెంగల్రాయుల యాదవ్, వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర మెంబరు రాజేంద్రరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జనార్దన్‌రాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



నగరి జనవరి5(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుతో కుటుంబానికి మంచి జరుగుతుందని అందువల్ల ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని టీడీపీ నాయకులు చలపతి, మాజీ కౌన్సిలర్ లత కోరారు. నగరి సామలమ్మ గుడి వద్ద టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. పలువురు సభ్యత్వం స్వీకరించారు.

ఒక రోజే రేషన్..!

- ముంగరమడుగు రేషన్ దుకాణానికి ఉదయమే లబ్ధిదారుల పరుగులు
- జనం పడిగాపులు
- ఎండీయూ ఆపరేటర్ నిర్వాకం



ఎండీయూ ఆపరేటర్ రాకపోవడంతో దుకాణం ఎదుట పడిగాపులు



ఆపరేటర్ రాకపోవడంతో రేషన్ కోసం దుకాణం ముందు వరుసక్రమంలో ఉంచిన సంచులు

బంగారుపాళ్యం, జనవరి5(ఆంధ్రజ్యోతి): ఒక రోజే రేషన్ పంపిణీ చేస్తామనడంతో ముంగరమడుగు గ్రామంలోని జనం అవస్థలు పడ్డారు. ముంగరమడుగు దళితవాడలో గ్రామంలో షాప్‌నెం 29 ఉంది. అందులో 247 రేషన్ కార్డులు ఉన్నాయి. వీరందరికీ బియ్యం అందించాల్సి ఉంది. అయితే ఎండీయూ ఆపరేటర్ ఒకరోజే రేషన్ ఇస్తామని చెప్పడంతో ఆదివారం ఉదయం నుంచే లబ్ధిదారులు దుకాణం ముందు నిలుచున్నారు. ఎంతసేపటికీ ఆపరేటర్ రాలేదు. 9 గంటలైనా రాకపోవడంతో లబ్ధిదారులు తమ సంచులను క్యూలో ఉంచి టిఫిన్ చేయడానికి వెళ్లారు. తర్వాత కూడా రాలేదు. దాదాపు 10.30 గంటలకు వచ్చి సరుకులు ఇవ్వడం ప్రారంభించారు. దీంతో పేదలు అవస్థలు పడ్డారు. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్ తమ గ్రామానికి సకాలంలో రేషన్ ఇవ్వకుండా తమను ప్రతి నెలా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వాపోయారు. ఒకే రోజు ఇస్తామని చెప్పడంతో అన్ని పనులు మానుకుని వస్తే గంటల తరబడి వేచిచూసేలా వ్యవహరిస్తున్నాడని విచారం వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకుని డీలర్ ద్వారానే గ్రామానికి రేషన్ అందించాలని పలువురు కోరుతున్నారు.

డీలర్ ద్వారా రేషన్ అందించండి



రేషన్ బియ్యాన్ని డీలర్ ద్వారానే అందించాలి. ఆపరేటర్ల వలన కార్డుదారులకు సకాలంలో రేషన్ అందడం లేదు. కూలి చేసుకునే గ్రామస్తులు గంటల తరబడి రేషన్ కోసం ఎదురుచూడాలంటే చాలా కష్టంగా ఉంది. 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు బియ్యం అందిస్తే బాగుంటుంది.

- మణి, ముంగరమడుగు గ్రామస్తుడు

వరసిద్ధుడి సేవలో పలువురు ప్రముఖులు

ఐరాల(కాణిపాకం), జనవరి 5(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామిని దర్శించుకున్నవారిలో సత్యసాయి జిల్లా మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎమ్మెస్.రాజు, తెలంగాణ రాష్ట్ర అడిషినల్ డీజీపీ టెక్నికల్ సర్వీసెస్ వివిశ్రీనివాసరావు ఉన్నారు. వీరు స్వామిని వేర్వేరుగా దర్శించుకున్నారు. వారిని ఎమ్మెల్యే మురళిమోహన్, ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వారిని వేదాశీర్వాద మండపంలో వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, కాణిపాకం ఎస్‌ఐ ధరణిధర పాల్గొన్నారు.





తెలంగాణ అడిషినల్ డీజీపీకి జ్ఞాపికను అందిస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, ఎమ్మెల్యేకి జ్ఞాపికను అందిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్

టీడీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే భాను ప్రకాష్ నివాళి



విజయపురం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహవీరపురంలో టీడీపీ కార్యకర్త చెంచయ్యకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నివాళులర్పించారు. క్షూరికాపురం పంచాయతీ మహవీరపురానికి చెందిన చెంచయ్య ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్, టీడీపీ నాయకులు బాలాజీ, మురళీనాయుడు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తమిళనాడులో రోడ్డు ప్రమాదం

తండ్రీకూతుళ్ల దుర్మరణం



అంకయ్య (ఫైల్‌ఫొటో)

విజయపురం, జనవరి 5(ఆన్‌లైన్): తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలోని పాతార్కాడు ఆదిఆంధ్రవాడకు చెందిన అంకయ్య(27), అతని కుమార్తె మోక్షిత(4) మృతి చెందారు. పోలీసు కథనం మేరకు వివరాలు .... అంకయ్య తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో కనకమ్మసత్రం(తమిళనాడు)కు కిరాణా సామగ్రి కోసం ద్విచక్రవాహనంలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారిని రఘునాథపురం వద్ద మినీవ్యాను ఢీకొంది. అంకయ్య, మోక్షిత తీవ్రంగా గాయపడ్డారు. చెన్నై జీహెచ్‌కు తరలించగా మార్గమధ్యలో మోక్షిత చనిపోయింది. చికిత్స పొందుతూ అంకయ్య ఆదివారం మృతి చెందాడు. భార్య రమ్య, మరో కుమార్తె పూర్ణిమ స్వల్ప గాయాలయ్యాయి.

మినీ వ్యాను బోల్తా

డ్రైవర్‌కు స్వల్పగాయాలు



వెదురుకుప్పం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మినీవ్యాను అదుపు తప్పి బోల్తాపడిన ఘైనమిది. ఆదివారం పచ్చికాపల్లం నుంచి వెదురుకుప్పం వైపు మినీవ్యాను బయలుదేరింది. కొమరగుంట క్రాస్ రోడ్డుకు సమీపంలోకి వచ్చే సరికి అతివేగం వల్ల అదుపు తప్పింది. తలక్రిందులుగా బోల్తాపడింది. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఆ సమయంలో ఎదురుగా మరో వాహనం వస్తే పెద్ద ప్రమాదం జరిగేదని అక్కడివారు చెప్పారు.

టీచర్ల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు: టీడీపీ



మాట్లాడుతున్న కోదండయాదవ్

చిత్తూరు సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల గురించి మాట్లాడే అర్హత మాజీ సీఎం జగన్‌కు లేదని టీడీపీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ పాలనలో హామీలు నెరవేర్చకుండా టీచరల్నుఉ అనేక రకాలుగా మోసం చేశారన్నారు. గత ప్రభుత్వంలో 17వ తేదీ వరకు జీతాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఉపాధ్యాయుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసి, మానసిక క్షోభకు గురిచేసిన జగన్‌కు నైతిక హక్కులేదన్నారు. ఉపాధ్యాయులు పొదుపు చేసుకున్న పీఎఫ్ ఫండ్‌ను కూడా పక్కదారి పట్టించారన్నారు. దాచుకున్న డబ్బు అందక టీచర్లు అనేక ఇబ్బందులకు గురైన విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలని చెప్పారు. ఉపాధ్యాయులతో మరుగుదొడ్ల శుభ్రత కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం రద్దుచేసిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో నేతలు జయచంద్రనాయుడు, బాబు నాయుడు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లె నుంచి తిరుమలకు పాదయాత్ర



చౌడేపల్లె, జనవరి5.(ఆంధ్రజ్యోతి) : తిరుమలకు 200 మంది భక్తులు కాలినడకన బయలుదేరారు. ఆదివారం మండలంలోని ఏకొత్తకోట పంచాయతీ అగ్రహారానికి చెందిన ఆనందస్వామి ఆధ్వర్యంలో గోవింద మాలధారణ భక్తులు పాదయాత్రగా ముందుకు సాగారు. మూడురోజుల పాదయాత్ర అనంతరం తిరుమల చేరుకుని స్వామివారిని దర్శనం చేసుకుంటామన్నారు.

భక్తి ప్రపత్తులతో పడిగట్ల పూజలు



అయ్యప్పస్వామి పూజల్లో సిన్మా శ్రీధర్ కుటుంబ సభ్యులు

చిత్తూరు కల్చరల్, జనవరి5 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గానగర్ కాలని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం శాస్త్రగిరి అయ్యప్ప స్వామి భక్త బృందం భక్తి ప్రపత్తులతో అయ్యప్ప స్వామి పడిగట్ల పూజ నిర్వహించారు. ప్రముఖ చలనచిత్ర పంపిణీ దారుడు, నిర్మాత సిన్మా శ్రీధర్ విచ్చేసి స్వామివారికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఆయన అన్నదానం చేశారు.

10న వైకుంఠ ఏకాదశి పూజలు

చిత్తూరు కల్చరల్, జనవరి5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆలయాల్లో ఈ నెల 10వ తేదీ వైకుంఠ ఏకాదశి పండుగను నిర్వహించుకోనున్నారు. గిరింపేట దుర్గాంబ ఆలయంలో 10వ తేదీ ఉదయం 6 నుంచి 11వ తేదీ 6 గంటల వరకు వైకుంఠ ఏకాదశి జాగరణ కార్యక్రమాలు నిర్వహించ నున్నామని ఆలయ ఈవో మునిశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని అన్నపూర్ణేశ్వరి దేవిగా అలంకరించి భక్తులకు అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా స్థానిక కోదండ రామాలయంలో స్వామివారి శిఖర, ఉత్తర ద్వార దర్శనాలు కల్పించనున్నట్లు అర్చకులు వేణుగోపాల్ తెలియజేశారు. అదే విధంగా స్థానిక మహాలక్ష్మి గోదాదేవి ఆంజనేయ సమేత వెంకటేశ్వర ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం, అభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టీ డీ.ఏ శ్రీనివాస్ తెలిపారు. నగరంలోని సంతపేట శ్రీరంగనాథ, కట్టమంచి వరదరాజ, నీవానది రాజు గుడి, వాసవి కన్యకాపరమేశ్వరి, పొన్నియమ్మ, వీరాంజనేయ, సీబీ రోడ్ వీరాంజనేయ ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నారు.

సైకిల్‌పై శబరిమల యాత్ర



యాదమరి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాల ధరించిన ఓ భక్తుడు సైకిల్ మీద శబరిమలకు బయలుదేరాడు. బాపట్ల జిల్లా చీరాలకు చెందిన పాకాల పాండు టీడీపీ అభిమాని. గతేడాది ఎన్నికల్లో టీడీపీ విజయం సాధిస్తే సైకిల్ మీద శబరిమల వచ్చి అయ్యప్పస్వామిని దర్శించుకుంటానని మొక్కుకున్నాడు. ఈ క్రమంలో బయలుదేరిన పాండు ఆదివారం యాదమరి మండల సమీపంలో కనిపించాడు.